క్లుప్తంగా

వెంకన్న ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరాలయం హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. 3 నెలల 15 రోజులకు గాను రూ.1,56,794 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎ.జగన్నాథరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పెట్లి అప్పారావు, లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ రాఘవరెడ్డి, ఎక్స్‌అఫీషియో మెంబర్ నారాయణాచార్యులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆది దంపతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దామా సుబ్బారావు దంపతులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీనగర్‌లోని శ్రీశ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు దంపతుల చేతులమీదుగా జరిపించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

సుబ్బారావు కుటుంబానికి రాఘవులు పరామర్శ



సుబ్బారావు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రాఘవులు

అక్కిరెడ్డిపాలెం: అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీపీఎం నాయకుడు జి.సుబ్బారావు కుటుంబాన్ని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పరామర్శించారు. షీలానగర్‌లోని సుబ్బారావు నివాసంలో ఆయన భార్య జి.మణిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, ఐద్వా నగర కార్యదర్శి వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంఘాలకు అవకాశం ఇవ్వాలి'

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించిన సర్వీస్ ఇంప్రూవ్‌మెంట్ గ్రూప్ (ఎస్ఐజీ) సమావేశంలో ప్రయాణికులు, ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం లేకపోవడం, వారి అభిప్రాయాలకు అవకాశం కల్పించకపోవడం వల్ల ఒరిగేది శూన్యమని ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రతీ మూడు మాసాలకు ఒకసారి ఎస్ఐజీ సమావేశం ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం డీసీఎం అవినాష్, స్టేషన్ మేనేజర్ ఎస్.ఆర్.కె.రావు ఆధ్వర్యంలో ఎస్ఐజీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకోకుండా, ఇక్కడి సమస్యలపై అవగాహన లేకుండా నామమాత్రంగా ముగించారని ఆరోపిస్తున్నారు. ఇకపై నిర్వహించే సమావేశంలో అయినా స్థానిక ప్రజా సంఘాలకు అవకాశం కల్పించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

హాస్టళ్లకు ఆధునిక హంగులు

- కోరమాండల్ సీఎస్సార్ నిధులతో అత్యాధునిక వసతులు




దయాల్‌నగర్‌లోని బాలికల వసతి గృహం



నెల్లిముక్కులోని బాలిక వసతి గృహం

పెదగంట్యాడ: మండలంలోని రెండు హాస్టళ్లు ఆధునిక హంగులద్దుకున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకున్నాయి. విద్యార్థులు ఉండే గదుల నుంచి బాత్రూమ్‌ల వరకూ కొత్త రూపును సంతరించుకున్నాయి. నెల్లిముక్కు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, దయాల్‌నగర్‌లోని కళాశాల బాలికల వసతి గృహాలను మొత్తం రూ.93 లక్షలతో రూపుదిద్దారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్సార్ నిధుల్లో నెల్లిముక్కు హాస్టల్‌ను రూ.70 లక్షలతో రూపురేఖలు మార్చారు. హాస్టల్‌లో మొత్తం 12 గదులను అందంగా మార్చివేశారు. బాత్‌రూమ్‌లను ఆధునికంగా నిర్మించారు. గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్స్ వేయించారు. ఆవరణలో అందమైన మొక్కలు వేసి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. విద్యుత్ వైర్లను పూర్తిగా మార్చి, కొత్త వాటిని వేయించారు. భవనం శ్లాబ్‌ను తొలగించి కొత్తగా మళ్లీ నిర్మించారు.

- దయాల్‌నగర్‌లోని హాస్టల్ భవనానికి రూ.23 లక్షలతో మరమ్మతులు చేశారు. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో మరమ్మతులు చేయించారు. పెయింట్లు వేసి అందంగా తీర్చిదిద్దారు.



నెల్లిముక్కులోని హాస్టల్‌లో విద్యార్థినుల గదులు

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

అగనంపూడి ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి 972 మార్కులు



బర్లి భావన (960 ఎంపీసీ)



సీహెచ్.మాధవి (905 సీఈసీ)



పి.ప్రసాద్ (911ఈఈటీ)

అగనంపూడి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన డి.సాయి హర్షిణి (972) ఈ కళాశాల విద్యార్థినే కావడం విశేషం. ఎంపీసీలో సెకండ్ టాపర్‌గా నిలిచిన బర్లి భావన (960)మార్కులు సాధించింది. సీఈసీ గ్రూపులో సీహెచ్ మాధవి 905 మార్కులు, ఈఈటీ గ్రూపులో పి.ప్రసాద్ 911 మార్కులను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ చెప్పారు. కళాశాల మొత్తం ఫలితాల్లో 58.10శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, విశాఖ జిల్లా ప్రభుత్వ కళాశాలల ఫలితాలను అనుసరించి ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఆయన చెప్పారు. వరుసగా నాలుగో ఏడాది ఈ ఘనత సాధించడంపై ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా

గాజువాక : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల గాజువాక, స్టీల్‌ప్లాంట్ జోన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను యామిని పత్రాన, మల్లాడి చరణ్, పెంట యశ్వంత్ 465 మార్కుల చొప్పున సాధించారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను శరగడం పావని, రాజాన కీర్తి 435 మార్కులను సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకు గాను కె.నవ్య 989 మార్కులు, తేజేష్ తాటికొండ 988, సీర దివ్యశ్రీ 987 మార్కులు, బైపీసీలో ఎం.సాత్విక 985 మార్కులు, రెడ్డి తులసి 984, ఆళ్ల రేష్మా సత్యశ్రీ 983 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో శ్రీనగర్‌లోని శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థి ఎ.మౌళిప్రియ అత్యుత్తమ మార్కులను సాధించింది. ఎంపీసీలో 966 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల డైరెక్టర్ టి.బలరామకృష్ణ తెలిపారు. ఈ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు తెలియజేశారు.

విజ్ఞాన్ విద్యార్థులకు భారీ వార్షిక వేతనాలు

ఫెడరల్ బ్యాంక్‌లో ఇద్దరికి కొలువు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు భారీ వార్షిక వేతనాలతో కొలువులు పొందారు. ఇటీవల ఎంబీఏ విద్యార్థులకు ఫెడరల్ బ్యాంక్‌తో పాటు ఇతర బ్యాంకులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. క్యాంపస్ డ్రైవ్‌లో ప్రతిభ కనబరిచిన టి.పృథ్వీరాజ్, సి.సౌమ్యలకు ఫెడరల్ బ్యాంక్ రూ.13.58 వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలను ఆఫర్ చేసినట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను యాజమాన్యం అభినందించింది. ప్రిన్సిపాల్ జ్యోతుల సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బడే ప్రసాద్, ఎంబీఏ విభాగాధిపతి మురళీకృష్ణ, బి.చంద్ర, వి.శివాజీ పాల్గొన్నారు.



విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందిస్తున్న రెక్టార్ మధుసూదనరావు

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక : గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్‌లోని వివిధ ఫీడర్లకు ఈ నెల 28న నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ–2 బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా భానోజీతోట, రాజీవ్‌మార్గ్, సింహగిరి కాలనీ, అజీమాబాద్, పైడిమాంబ కాలనీ, నెహ్రూనగర్, మార్వెల్ స్కూల్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీహెచ్‌పీవీ పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ బీహెచ్‌పీవీ–షీలానగర్ ఫీడర్, 11 కేవీ బీహెచ్‌పీవీ–ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అక్కిరెడ్డిపాలెం, పంచవటి, అక్కిరెడ్డిపాలెం వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఒక్కరోజులో రూ.57 లక్షల ఆస్తిపన్ను వసూలు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ రెవెన్యూ సిబ్బంది బుధవారం ఒక్కరోజే రూ.57.78 లక్షల ఆస్తిపన్నును వసూలు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను మొత్తం చెల్లించినవారికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు శాతం డిస్కౌంట్‌తో పన్ను వసూళ్లలో ప్రగతి సాధిస్తునారు. అందులో భాగంగా హిందూస్తాన్ జింక్ కర్మాగారం రూ.54,06,251ను జీవీఎంసీకి చెల్లించింది. ఈ మొత్తానికి చెందిన చెక్కులను ఆ సంస్థ ప్రతినిధి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. 74వ వార్డులోని మదర్సా నిర్వాహకులు రూ.3.69 లక్షల ఆస్తి పన్నును చెల్లించారు. ఒక్కరోజులో మొత్తం రూ.57.78 లక్షలు వసూలైనట్టు జెడ్సీ పేర్కొన్నారు. ఈ నెలలో ఐదు శాతం డిస్కౌంట్ అమల్లోకి వచ్చిన తరువాత 19,202 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.14.92 కోట్లు వసూలైంది. దీనిపై జోనల్ రెవెన్యూ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోలు సీహెచ్.రామనారాయణ, శ్రీకాంత్‌లను జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు.



హిందూస్తాన్ జింక్ ఆస్తి పన్ను చెక్కును జెడ్సీ సింహాచలానికి అందజేస్తున్న ఆర్వోలు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రజా వ్యతిరేకత

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి ప్రజామోదం లేదనడానికి ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 804వ రోజు బుధవారం అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

జగనన్నతో మరింత ఉజ్వల భవిష్యత్తు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 71వ వార్డులో సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. అర్హత ఉండీ పథకం అందలేదనే పరిస్థితి ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు, వార్డు నాయకులు ఆచారి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిప్పల అరుణకు ఘన నివాళి

పెదగంట్యాడ: గాజువాక వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు తిప్పల చినఅప్పారావు భార్య, పులి భూలోకరెడ్డి కుమార్తె తిప్పల అరుణ ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వెంకన్నపాలెంలోని ఆమె స్వగృహంలో బుధవారం నిర్వహించిన సంతాపసభలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు నివాళులర్పించారు.



అరుణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బూడి ముత్యాలనాయుడు తదితరులు

'అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు'

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి అభివృద్ధి చేస్తుంటే, చంద్రబాబు దానిని అడ్డుకుంటున్నారని 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు అన్నారు. హరిజన జగ్గయ్యపాలెంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆయన నిర్వహించారు. జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందజేస్తుంటే, చంద్రబాబు వారి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని, రాష్ట్రాన్ని నాశనం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రజలే వారికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి, జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మహిళల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి అనుమతితో ఇంటికి జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో శివ, పెట్లి అప్పారావు, మళ్ల కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.



హరిజన జగ్గయ్యపాలెంలో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న సన్యాసిరావు

స్టీల్ బీఎంఎస్ ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. బీఎంఎస్ జాతీయ మహాసభలో తీసుకున్న నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఉదయం ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్మికులందరికీ సామాజిక సురక్ష కల్పించాలని, కాంట్రాక్ట్ కారిృక వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ లేబర్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ చట్టం 1970ని మార్పు చేయాలని కోరారు. ఆర్థిక వికాసం కోసం నేషనల్ లేబర్ పాలసీని ఏర్పాటు చేయాలని, కనీస వేతనాల స్థానంలో జీవించే వేతనం (లివింగ్ వేజెస్) ఇచ్చే విధంగా చట్టంలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి రాందాస్ నరేంద్ర, స్టీల్ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్. రాధాకృష్ణన్, అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు, హరీష్ వర్మ, ఎ.ఎం.రెడ్డి, సూర్యనారాయణ, రామారావు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఖాళీ స్థలానికి హౌస్ కమిటీ పట్టా

- కోర్టు కేసును ధిక్కరించి చేపట్టిన నిర్మాణం
- ఫిర్యాదులందుతున్నా స్పందించని టౌన్‌ప్లానింగ్ విభాగం



వివాదాస్పద స్థలంలో చేపట్టిన నిర్మాణం

గాజువాక : గాజువాక హౌస్ కమిటీ పరిధిలోని భానోజీతోటలో ఓ ఖాళీ స్థలానికి గాజువాక మండల రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణ పట్టా జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ స్థలం తనదని మరో మహిళ కోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతం విచారణ సాగుతోంది. జీవో 301 ప్రకారం ఆ ఖాళీ స్థలానికి పట్టా పొందిన మహిళ కోర్టు కేసును కూడా లెక్క చేయకుండా గృహ నిర్మాణం చేపట్టింది. దీనిపై ఫిర్యాదులందుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మాత్రం స్పందించడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

గాజువాక హౌస్ కమిటీ పరిధిలో నిర్మాణాలకు మాత్రమే క్రమబద్ధీకరణ పట్టాలను జారీ చేయాలంటూ జీవో నంబర్ 301ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ జీవోలోని నిబంధనలకు విరుద్ధంగా ఒక మహిళ డోర్ నంబర్ 14–10–2/7తో గాజువాక సర్వే నంబర్ 82లోని 385 చదరపు గజాల ఖాళీ స్థలానికి క్రమబద్ధీకరణ పట్టాను పొందింది. ఇదే డోర్ నంబర్‌తో ఆ పక్కనే ఉన్న మరో ఇంటికి కూడా అధికారులు పట్టాను జారీ చేసినట్టు తెలిసింది. ఒకే డోర్ నంబర్‌తో ఇద్దరికి పట్టాలు ఎలా మంజూరు చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా, అధికారులు పట్టా జారీ చేసిన స్థలం తనదని పేర్కొంటూ మాటూరి లక్ష్మి అనే మహిళ తొలుత జేసీ కోర్టును, ఆ తరువాత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. ఆ పట్టాను రద్దు చేయాలని కోరింది. ప్రస్తుతం ఆ కేసు అటు హైకోర్టులోను, ఇటు జేసీ కోర్టులోను విచారణలో ఉంది. ఈ తరుణంలో పట్టా పొందిన మహిళ ఆ స్థలంలో నిర్మాణం చేపట్టింది. దీనిపై ఫిర్యాదులు అందడంతో నాలుగు నెలల క్రితం అప్పటి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆ నిర్మాణాన్ని తొలగించి జేసీకి ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పుడు ఆ సిబ్బంది బదిలీ అయ్యి కొత్తవారు రావడంతో నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించారు. దీనిపై కొంతమంది స్థానికులతో పాటు మాటూరి లక్ష్మి కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, అధికారులు స్పందించడం లేదని పేర్కొంటున్నారు. తమ ఫిర్యాదును స్వీకరించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు రకరకాల నోటీసుల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అరుణవల్లి వద్ద ప్రస్తావించగా నిర్మాణాన్ని తొలగిస్తామని చెప్పారు. బందోబస్తు కోసం గాజువాక పోలీసులకు లేఖ పంపామని పేర్కొన్నారు.

యూటీఎస్ యాప్‌లో కానరాని తెలుగు

- ట్విట్టర్‌లో ఫిర్యాదుపై స్పందించిన డీఆర్ఎం
- సమస్య పరిష్కారానికి చర్యలు

అగనంపూడి: భారతీయ రైల్వేశాఖ ఇటీవల ప్రవేశపెట్టిన అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) యాప్‌లో భారతీయ భాషల్లో టికెట్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ యాప్‌లో తెలుగు భాషలో టికెట్ బుక్ చేసుకొనే సదుపాయం కల్పించలేదు. భారత రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషల్లో టికెట్ బుకింగ్ సదుపాయం కల్పించి, తెలుగును వదిలేయడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాల్తేరు డీఆర్ఎంకు, రైల్వే ఉన్నతాధికారులకు ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగు భాషను యాప్‌లో వెంటనే చేర్చాలని అసోసియేషన్ ప్రతినిధులు కాటం చంద్రరావు, కంచుమూర్తి ఈశ్వర్‌లు ట్విట్టర్ వేదికగా కోరారు. దీనిపై డీఆర్ఎం స్పందించారని, యాప్‌ను రూపొందించిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు బదులిచ్చారని వారు తెలిపారు.

పరిశుభ్రంగా డ్రైనేజీలు

పెదగంట్యాడ: రహదారులు, కాలువల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, వినాయకనగర్ వుడా కాలనీలో కాలువల్లోని పూడికలను బుధవారం ఆయన దగ్గరుండి శుభ్రం చేయించారు. ఏఎంవోహెచ్ మాట్లాడుతూ ఇక్కడి కాలువలను శుభ్రం చేయడం లేదని ఫిర్యాదు అందడంతో, ఈ పనులు చేపట్టామన్నారు. ప్రజలు ఇళ్లలోని చెత్తను సేకరణ కోసం ఇంటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇలా రోడ్లపై, కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగు పేరుకుపోవడంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.



డ్రైనేజీల్లో పూడిక తీయిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

జీవో నం.388 పట్టాల్లో తప్పుల సవరణకు అవకాశం

పెదగంట్యాడ: జీవో నంబర్ 388 ద్వారా పొందిన పట్టాల్లో తప్పులుంటే సరిచేసుకోవాలని పెదగంట్యాడ మండల తహసీల్దార్ రమాదేవి కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు మండల పరిధిలో 381 పట్టాలను తాము పరిశీలించామని, అందులో 16 పట్టాల్లో అక్షరదోషాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. మిగిలిన వారు కూడా తమ పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. దోషాలుంటే వెంటనే సచివాలయంలో సంప్రదించి సరిదిద్దించుకోవాలని తెలిపారు. పట్టా పొందిన వారు మృతి చెందితే వారి వారసుల పేరు మీద మార్చుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. పేరు, చిరునామా మార్పులు, సర్వే నంబర్ తప్పుగా పడినా సరిదిద్దుకోవచ్చన్నారు. పట్టాల్లో ఉన్న ఫొటోలు తప్పుగా ముద్రించినా మార్చుకోవచ్చని చెప్పారు. వచ్చే నెల 25 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని, పట్టాదారులు తమ పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై)లో భాగంగా జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో ఒక్కో విభాగంలో 60 సీట్లు ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌కు 8వ తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు అర్హులని తెలిపారు. అసిస్టెంట్ మేసన్ కోర్సుకు ఐదో తరగతి పాసైన వారు, జేసీబీ ఆపరేటర్ కోర్సుకు టెన్త్‌పాసైన, లైట్ కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. పెదగంట్యాడలోని తమ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టేషనరీని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంబంధిత రంగంలో (ప్రైవేటు సెక్టార్లలో) ఉపాధి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ కోసం రుసుం చెల్లించనవసరం లేదని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలోగానీ, 83090 03957, 91332 42666, 94903 91324 నంబర్లలో గానీ సంప్రదించాలని సూచించారు.